# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.
- రాష్ట్రంలో అర్హత కలిగిన మహిళలకు అక్టోబర్ 31 నుండి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తామని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు ఉచితంగా తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.
- "దానా" తూఫాన్ ప్రభావంతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో రేపు రాత్రి నుంచి 100 నుండి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

========================

ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు మంత్రి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో "దీపం పథకం" కింద మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే ఉచిత ఇసుక విధానంలో భాగంగా సినరేజ్, జీఎస్టీ చార్జీలను రద్దు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. దేవాలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పిస్తూ, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. విశాఖ శారదా పీఠం భూ కేటాయింపులు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎర్రమట్టి దిబ్బల తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై కమిటీ వేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

========================

రాష్ట్రంలో అర్హత కలిగిన మహిళలకు ఈనెల 31వ తేదీ నుండి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తామని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంత్రి వర్గ సమావేశం అనంతరం ఈరోజు అమరావతిలో మంత్రి

పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒకేసారి 3 గ్యాస్ సిలిండర్లు తీసుకోకుండా ప్రతి 4 నెలలకు ఒక సిలిండర్ చొప్పున సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేసిన మహిళ బ్యాంక్ ఖాతాలో డీబీటీ పద్ధతిలో 48 గంటల్లో తిరిగి ఆ నగదు జమ అవుతుందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

=======================

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) నూతన  ఛైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారిని ఏఆర్ అనురాధను నియమిస్తూ.. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా అనురాధ బాధ్యతలు నిర్వహించారు. గత ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ రాజీనామా చేయడంతో కొన్ని నెలలుగా ఏపీపీఎస్సీ ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉండటంతో అనురాధను నియమిస్తూ సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

విరామం

=======================

పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు ఉచితంగా తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంత్రి వర్గ సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానంలో సినరేజ్, జీఎస్టీ చార్జీలను రద్దు చేస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. జీఎస్టీతో సంబంధం లేకుండా ఒక్క సినరేజ్ చార్జీల వల్లే 264 కోట్ల రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం కానుందన్నారు. జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జ్ మంత్రులు ఉచిత ఇసుక సక్రమంగా అమలయ్యేలా  చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించామన్నారు. 108 ఇసుక రీచ్ లను గుర్తించామని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

=======================

“దానా” తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని తీర ప్రాంతం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం చేసింది. రేపు రాత్రి నుంచి 100 - 110 కిలో మీటర్ల  వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆ సంస్థ కోరింది. రేపు సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

=======================

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన “దానా” తుఫాను గంటకు 15 కిలో మీటర్ల వేగంతో వాయువ్య దిశగా ప్రయాణించి ఒడిసాలోని పారాదీప్ కు 520 కిలోమీటర్ల దూరంలోనూ, పశ్చిమ బెంగాల్ లోని సాగర్ ఐలాండ్ కు ఆగ్నేయ దిశలో 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది వాయువ్య దిశగా పయనించి రేపు ఉదయానికి వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారి రాత్రి నుంచి 25వ తేదీ ఉదయం వరకు గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ తీవ్ర తుఫానుగా భితర్కనికా, ధమారా సమీపంలోని పూరీ, సాగర్ దీవుల మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది.

=======================

భారతీయ స్టేట్ బ్యాంక్ (SBI) అందిస్తున్న వివిధ రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రకాశం జిల్లా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈరోజు ఒంగోలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం జిల్లా రీజనల్ మేనేజర్ ఎస్. గున్నేశ్వరరావు, ఆర్.ఏ.సి.పి.సి ఏజీఎం పీ.టి.వెంకట్రావు ఎస్.బి.ఐ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు మాట్లాడుతూ... పండుగల వేళ ప్రత్యేకంగా గృహ రుణాలను తగ్గింపు వడ్డీ రేట్లపై అందిస్తున్నామన్నారు. రుణాలకు సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రాయితీ ఇస్తున్నామన్నారు. గృహ రుణాలు పొందిన వారికి "ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం" కింద 3 లక్షల రూపాయల వరకు రుణం అందిస్తున్నామని వెల్లడిస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

========================

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ "దానా" తుఫాను కారణంగా రైల్వేశాఖ పలు రైళ్లను రద్దు చేసింది. రేపటి నుంచి ఈనెల 27వ తేదీ వరకూ నిర్దేశించిన రైళ్లను ప్రారంభ స్థానం నుంచే నిలుపుదల చేస్తున్నామని రైల్వే అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. రద్దు చేసిన వాటిలో రేపు బెంగళూరులో బయలుదేరాల్సిన SMVT బెంగళూరు - హౌరా హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ నుంచి బయలు దేరాల్సిన భువనేశ్వర్ - CST ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ - MGR చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ లు ఉన్నాయి. అలాగే ఈనెల 25వ తేదీన చెన్నై నుంచి బయలు దేరాల్సిన MGR చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు చేశారు.

========================

========================